## ముందు గుర్తిస్తేనే క్యాన్సర్ నివారణ



మాజీ ఎంపీ వినోద్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మాధవి

విద్యానగర్, ఫిబ్రవరి 13 : ఇటీవల ప్రతిమ, చల్మెడ వైద్య కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాన్సర్ శిబిరంలో చేసిన క్యాన్సర్ పరీక్షల ఫలితాలు వచ్చాయి. 800 కుపైగా మహిళలకు టెస్టులు చేయగా, శిబిరంలో పాల్గొన్న వారికి మంగళవారం కరీంనగర్ భగత్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ప్రతిమ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ బోయినపల్లి మాధవి అవగాహన కల్పించారు. ఇలాంటి వైద్య శిబిరాల వల్ల ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే వందశాతం నయం చేయవచ్చునని సూచించారు. శిబిరాల్లో 40 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళ పరీక్షలు చేసుకోవాలని సూచించారు.



రాజమల్లయ్య కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

## ఏఎస్‌ఐ కుటుంబానికి భరోసా

- ఇటీవల అనారోగ్యంతో రాజమల్లయ్య మృతి
- పోలీస్ భద్రత స్కీం కింద ₹7.63లక్షల చెక్కు అందజేసిన ఎస్పీ

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 13: ఏఎస్‌ఐ రాజమల్లయ్య కుటుంబానికి పోలీసుశాఖ భరోసానిచ్చింది. వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేసిన రాజమల్లయ్య కొద్దిరోజుల క్రితమే అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ క్రమంలో పోలీసు భద్రత పథకం కింద ఆయనకు ₹7.63లక్షలు మంజూరయ్యాయి. మంగళవారం జగిత్యాల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఏఎస్‌ఐ కుటుంబానికి చెక్కును అందజేశారు. అధైర్యపడొద్దని, పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో డీపీవో ఏవో అమర్‌నాథ్, సూపరింటెండెంట్ నయీం ఉన్నారు.





కృష్ణా ప్రాజెక్టుల కోసం కేసీఆర్ జంగ్ సైరన్

కరీంనగర్: సభకు తరలివెళ్తున్న మేయర్ సునీల్‌రావు, నినదిస్తున్న బీఆర్‌ఎస్ నగరధ్యక్షుడు చల్లా హరిశంకర్, నాయకులు



సిరిసిల్ల టౌన్: తరలివెళ్తూ నినదిస్తున్న నాయకులు

## పోరాటాలు చేద్దాం.. వైఫల్యాలు ఎండగడుదాం



- ప్రజలకు అన్యాయం జరిగితే సహించే ప్రశ్నేలేదు
- ఇచ్చిన హామీల అమలు కోసం నిలదీసుడే
- చలో నల్లగొండ సభ సాక్షిగా గర్జించిన కేసీఆర్
- డబుల్ స్పీడ్‌తో అధికారంలోకి వస్తామని ధీమా
- ఉమ్మడి జిల్లా నుంచి సభకు తరలిన గులాబీ దళం
- అధినేత ప్రసంగంతో శ్రేణుల్లో పెరిగిన ధైర్యం
- ఇక కొత్త ఉత్సాహంతో ముందుకు

'తెలంగాణను అన్నిరంగాల్లో ఆదర్శంగా నిలిపాం. ఎవరికీ ఏ ఇబ్బంది రాకుండా చూసుకున్నాం. కానీ ఇప్పుడు ఏ రంగంలో రాష్ట్ర ప్రజలకు అన్యాయం జరిగినా సహించే ప్రశ్నేలేదు. నా ప్రాణం ఉన్నంత వరకు ప్రజల హక్కుల కోసం పోరాటం చేస్తా. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు నిలదీడయమేకాదు, అవసరమైతే పోరాటాలు చేసి ప్రజల పక్షాన నిలుస్తాం' అంటూ బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ భరోసానిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా జలాల హక్కులను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్‌ఎంబీ)కు ధారాదత్తం చేయడాన్ని నిరసిస్తూ మంగళ వారం 'చలో నల్లగొండ' పేరిట నిర్వహించిన భారీ బహిరంగ సభలో గర్జించారు. జరుగుతున్న అన్యాయంపై చైతన్యం చేయడమే కాదు, పోరాటాలు చేద్దాం.. వైఫల్యాలు ఎండగడుదామంటూ మరో సమరానికి సన్నద్ధం చేశారు.

కరీంనగర్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): కృష్ణా జలాల్లో న్యాయమైన హక్కులను కాపాడేందుకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మంగళవారం నిర్వహించిన 'చలో నల్లగొండ' భారీ బహిరంగ సభకు ఉమ్మడి జిల్లా నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కదిలారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత మొదటిసారి సభ కావడం, అధినేత హాజరవుతుండడంతో 13 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. సభ సాయంత్రం నాలుగు గంటలకు కాగా, ఉదయం నుంచే ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో కలిసి ప్రత్యేక వాహనాల్లో బయలుదేరారు. గులాబీ జెండాలు చేతబూని.. జై కేసీఆర్ నినాదాలు చేస్తూ కదిలారు. అధినేత కేసీఆర్ చేసిన దిశానిర్దేశంతో నూతనోత్సాహం నింపుకున్నారు.

### అధినేత దిశానిర్దేశం.. జోష్

చలో నల్లగొండ సభ సాక్షిగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేసిన ప్రసంగం అటు ప్రజలను.. ముఖ్యంగా పార్టీ శ్రేణుల్లో మనోధైర్యాన్ని నింపిందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఎన్నికల తర్వాత తొలి బహిరంగ సభ కావడం, అందులో అధినేత కేసీఆర్ రావడం ప్రాధాన్యం సంతరించుకున్నది. కాంగ్రెస్ సర్కారు తీసుకున్న తప్పుడు నిర్ణయంతో కృష్ణా పరీవాహక ప్రాంతంలోని ఐదు జిల్లాలకు జరిగే అన్యాయాన్ని ఎండగడుతూనే, మరోవైపు కాంగ్రెస్ హామీల అంశాలను ప్రస్తావిస్తూ, ప్రశ్నిస్తూ చేసిన ప్రసంగం అందరిలో జోష్ నింపింది. ముఖ్యంగా ప్రజలను ఆలోచింపచేయడమేకాదు పార్టీ శ్రేణులకు ఒక దిశానిర్దేశం చేసినట్లు కనిపించింది. ముందుగా కేఆర్‌ఎంబీకి ధారాదత్తంచేసిన హక్కుల వల్లే జరిగే అన్యాయాన్ని వివరించిన కేసీఆర్, దానికి పరిష్కార మార్గాలు కూడా చూపెట్టారు. తక్షణం అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసి పోరాటం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచనలు చేశారు. అక్కడితో ఆగకుండా ముఖ్యమంత్రి, మంత్రులు రైతు బంధు విషయంలో మాట్లాడుతున్న మాటలకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఇకనైనా మాట తీరు మార్చుకోవాలని సూచించారు. కరెంటు, రైతు బంధు ఇతర అంశాల విషయంలోనూ ప్రశ్నలు సంధించారు. మొత్తంగా ఏ విషయంలో అన్యాయం జరిగినా సహించే ప్రశ్నేలేదని చెప్పారు. హామీల అమలుకోసం తెలంగాణ హక్కుల కోసం, పోరాటం చేయాల్సిన అవసరం వస్తే అందరూ కదిలిరావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే.. ఎక్కడికక్కడే నిలదీయాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. పోరాటాలు చేయడానికి వెనుకాడొద్దని చెబుతూ శ్రేణుల్లో మనోధైర్యాన్ని నింపారు. ఇన్నాళ్లూ కొంత ఊగిసలాటలో ఉన్న పార్టీ శ్రేణులకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేసిన దిశానిర్దేశం కొత్తజోష్ నింపినట్లయిందని నాయకులు చెబుతున్నారు.



## ఘనం.. అమ్మవారి బోనం

నెత్తినబోనంతో క్యూలో దర్శనం కోసం నిలబడ్డ భక్తులు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 13: వేములవాడ బద్దిపోచమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. డప్పు చప్పుళ్లు శివసత్తుల నృత్యాల నడుమ నెత్తిన బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. క్యూలో గుండా వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. కల్లుపోసి సారెపెట్టి బోనం సమర్పించారు. ఇంటిల్లిపాదిని సల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్ ఆధ్వర్యంలో సీనియర్ అసిస్టెంట్ ఎడ్ల శివ ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.



డీపీవో వీరబుచ్చయ్యను సన్మానిస్తున్న కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి , అధికారులు

## పనితీరుతోనే గుర్తింపు

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి • జిల్లాస్థాయి అధికారులకు వీడ్కోలు

కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 13 : మెరుగైన పనితీరుతోనే గుర్తింపు వస్తుందని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. జిల్లాలో పనిచేసి బదిలీపై వెళ్తున్న పలువురు జిల్లాస్థాయి అధికారులకు జిల్లా అధికారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో వీడ్కోలు పలికారు. ఇందులో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, ఐఏఎస్‌గా గతంలో ఎన్నో జిల్లాల్లో వివిధ హోదాల్లో పనిచేసినప్పటికీ కరీంనగర్ జిల్లాలో పనిచేసిన కాలం తనకు చిరకాలం గుర్తుండిపోతుందన్నారు. జిల్లాలో చేపట్టే ఏ కార్యక్రమమైనా అధికారులంతా స్నేహభావంతో బృందంగా ఏర్పడి ఎలాంటి రిమార్కులు లేకుండా వందశాతం సక్సెస్ చేస్తారని కొనియాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారులంతా సమయంతో సంబంధం లేకుండా వారికి అప్పగించిన పనులు సకాలంలో పూర్తి చేసి, విజయవంతం చేశారని చెప్పారు. అంకితభావం, నిబద్ధతతో పనిచేస్తూ విజయవంతం చేయడంలో జిల్లా అధికారయంత్రాంగం ముందుంటుందని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులకు ఒక చోటు నుంచి మరో చోటుకు బదిలీ జరగడం సర్వసాధారణమని చెప్పారు. జిల్లా అధికారులంతా కలిసికట్టుగా ఉంటూ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తమ ప్రత్యేకతను చాటడం అభినందనీయమన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న అధికారులు డీపీవో వీరబుచ్చయ్య, జడ్పీ సీఈవో పవన్‌కుమార్, డీఆర్‌డీవో శ్రీలత, డీవైఎస్‌వో రాజవీరు వారి సర్వీసులో ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. చివరగా కలెక్టర్, ఇతర అధికారులు వారిని శాలువాలతో సన్మానించి, వారి ఫొటో పెయింటింగ్ మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ రవీందర్, సీపీవో కొమురయ్య, మార్కెటింగ్ అధికారి పద్మావతి, జిల్లా పరిశ్రమల అధికారి నవీన్, డీడబ్ల్యూవో సరస్వతి, ఇతర శాఖల అధికారులు నతానియేల్, సురేశ్, టీ వెంకన్న, హార్టికల్చర్ జేడీ శ్రీనివాస్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, డీపీఆర్‌వో కలీం పాల్గొన్నారు.













కరీంనగర్: మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

## సంజయ్ ఆరోపణలు కాదు.. నిరూపించు

- దమ్ముంటే మేడిగడ్డ సబ్ కాంట్రాక్ట్ తీసుకున్న ఆ మాజీ ఎంపీ ఎవరో చెప్పు?
- లేదంటే తప్పు మాట్లాడనని ఒప్పుకో
- వచ్చే ఎన్నికల్లో ఓడిపోతానన్న భయంతో ఏదేదో మాట్లాడుతున్నవ్
- ఐదేళ్లలో నీవు చేసిందేమీ లేదు
- కరీంనగర్ సెగ్మెంట్‌లో ఐదు రూపాయలైనా ఖర్చుచేసినవా..?
- కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ధ్వజం

కార్పొరేషన్, ఫిబ్రవరి13: బండి సంజయ్ ఎంపీ హోదాలో ఉండి గాలి మాటలు మాట్లాడుతున్నారని కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ మండిపడ్డారు. మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మించిన ఎల్అండ్‌టీ కంపెనీని ఓ మాజీ ఎంపీ బెదిరించి తన సమీప బంధువులకు సబ్ కాంట్రాక్ట్ ఇప్పించుకున్నాడని ఆరోపిస్తున్నాడని, దమ్ముంటే ఆ మాజీ ఎంపీ ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారు. సోయిలేని మాటలు మానుకుని అసలు నిజాలేంటో నిరూపించాలని, లేదంటే తాను మాట్లాడింది తప్పని ఒప్పుకోవాలని హితవుపలికారు. మాట్లాడితే గొప్పలు చెప్పుకునే ఆయన ఈ ఐదేండ్లలో కరీంనగర్‌కు చేసిందేమిటో చెప్పాలని ప్రశ్నించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడారు. సంజయ్ చేసిన ఆరోపణలపై ఘాటుగా స్పందించారు. తాను 2014 నుంచి 2019 వరకు ఎంపీగా ఉన్నానని, అంతకు ముందు పొన్నం ప్రభాకర్, కేసీఆర్, చెన్నమనేని విద్యాసాగర్ రావు, ఎల్ రమణ ఎంపీలుగా ఉన్నారని, అందులో ఎవరి బంధువులకు మేడిగడ్డ బ్యారేజ్ సబ్ కాంట్రాక్టు ఇచ్చారో ఆయన సమాధానం చెప్పాలన్నారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతోనే ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని, ఆయన మాటలు విని నవ్వాలో, ఏడ్వాలో కూడా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ఓ ఎంపీ హోదాలో మాట్లాడుతున్నప్పుడు అన్నీ తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. ఇలా ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడడం సరికాదని, పేరు చెప్పే ధైర్యం లేకుండా ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మరని చెప్పారు. ఎల్అండ్‌టీ అనేది ఓ మల్టీనేషనల్ కంపెనీ అని, అలాంటి సంస్థలు సబ్ కాంట్రాక్ట్ ఇస్తాయని తాను అనుకోవడం లేదన్నారు. సంజయ్‌కు ఇన్నాళ్లు ప్రజలు గుర్తుకు రాలేదని, ఇప్పుడు మళ్లీ ఎన్నికలు రాగానే యాత్ర చేస్తున్నారని విమర్శించారు. ఆయన ఐదేళ్లలో చేసిందేమీ లేదని, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఐదు రూపాయల పని చేయలేదని మండిపడ్డారు. అలాంటిది ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని యాత్ర చేస్తున్నారని ప్రశ్నించారు. కేంద్రం అమలు చేస్తున్న ఉపాధి హామీ, తదితర పథకాలకు వస్తున్న నిధులను తానే తెచ్చానంటూ పెద్ద పెద్ద పోస్టర్లు వేసుకొని ప్రచారం చేసుకోవడం ఆయనకే చెల్లిందన్నారు. వేములవాడ దేవస్థాన అభివృద్ధికి ఆయన ఒక్క రూపాయి తీసుకువచ్చారా..? అని ప్రశ్నించారు. తాను వైవీ సుబ్బారెడ్డిని ఒప్పించి కరీంనగర్‌కు టీటీడీ నుంచి ₹25 కోట్లతో వేంకటేశ్వర దేవాలయం తీసుకువచ్చామన్నారు. హిందుత్వం అని చెప్పుకునే బండి ఇప్పటి వరకు ఒక్క గుడి, కనీసం బడికైనా..? నిధులు తెచ్చారా అని ప్రశ్నించారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో ఓడిపోతాడన్న భయంతోనే ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. టిప్పర్ ఉత్తరాలు రాశాడు కానీ, తట్టెడు మట్టి పోయలేదని తనపై విమర్శలు చేసిన సంజయ్, ఎంపీగా ఏం చేయాలో తెలుసుకోవాలని హితవుపలికారు. తాను ఎంపీగా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అనేక ఉత్తరాలను ప్రభుత్వాలకు రాశానని గుర్తు చేశారు. ఉత్తరాలు రాసి ఏం చేశానో..? ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత చెబుతానని స్పష్టం చేశారు. ఇక మీదట ఏది పడితే అది మాట్లాడితే ఊరుకునేది లేదని, ప్రతి అంశంపై తాము ధీటుగానే స్పందిస్తామని హెచ్చరించారు. మేడిగడ్డ విషయంలో జ్యుడీషియల్ ఎంక్వయిరీ వేయాలని తమ పార్టీ కోరిందని, అలాగే జరిగిన దానిని వెంటనే సరిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సీఎం మంగళవారం మేడిగడ్డకు వెళ్తున్నందున అక్కడ ఆ కంపెనీ సబ్‌కాంట్రాక్ట్ ఇచ్చిందో లేదో స్పష్టత ఇవ్వాలని కోరారు. రానున్న రోజుల్లో రైతులకు ఇబ్బంది కాకుండా చూడాలన్నారు. ప్రతి సమస్యపై స్పందించే గుణం బీఆర్‌ఎస్‌కు ఉందన్నారు. తాము నల్లగొండ సభ పెడుతున్నందు వల్లే కృష్ణా జలాలకు సంబంధించి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. సమావేశంలో గంగాధర ఎంపీపీ మధుసూదన్, బీఆర్‌ఎస్ నాయకులు హమీద్, జక్కుల నాగరాజు, దూలం సంపత్ గౌడ్, వోల్లాల శ్రీనివాస్ గౌడ్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో ఏసీబీ

శామీర్‌పేట తహసీల్దార్, బంధువుల ఇండ్లలో సోదాలు



సత్యనారాయణ ఇంట్లో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

రాంనగర్, ఫిబ్రవరి 13: శామీర్‌పేట తహసీల్దార్ తోడేటి సత్యనారాయణ రూ.10 లక్షలు తీసుకొని ఏసీబీ అధికారులకు పట్టుబడగా ఏసీబీ అధికారులు మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కరీంనగర్‌లోని హిందూపురికాలనీలో గల ఆయన నివాసం, విద్యానగర్‌లోని అతని బంధువుల నివాసాల్లో సోదాలు చేశారు. సత్యనారాయణ భార్య రేణుక జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని పూడూర్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నది. ఆమెను కూడా ఏసీబీ పోలీసులు విచారించి పలు డాక్యుమెంట్లను పరిశీలించి సమాచారం సేకరించారు. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో సోదాలు జరిగాయి.

## కొండగట్టు భక్తజన సందోహం

మల్యాల, ఫిబ్రవరి 13: కొండగట్టు క్షేత్రం కిటకిటలాడింది. ఎములాడ రాజన్నకు సమ్మక్క తొలి మొక్కు సమర్పించిన భక్తజనం, ఆ తర్వాత అంజన్న సన్నిధికి పోటెత్తింది. సోమవారం రాత్రే రాష్ట్ర నలుమూలల నుంచి బస్సులు, వాహనాల్లో ఆలయానికి వేలాదిగా చేరుకున్నారు. మంగళవారం తెల్లవారుజామునే కోనేరులో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే అనుబంధ ఆలయాలైన లక్ష్మి, వేంకటేశ్వరస్వామి, భేతాళస్వామి, కోదండ రామాలయం, బొజ్జపోతన, మునిగుహలు, కొండల రాయుడి పాదుకలను దర్శించుకున్నారు. దొంగల మర్రి నుంచి ఆలయం దాకా మూడు కిలోమీటర్ల మేర వాహనాల రద్దీ కనిపించింది. ఆలయ ఈవో టంకశాల వెంకటేశం, పాలక మండలి చైర్మన్ తిరుక్కోవళూర్ మారుతీస్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు. సుమారు 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారని, మొత్తం ₹20 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు.

## ఫోర్జరీ కేసులో ఇద్దరి రిమాండ్

మానకొండూర్ రూరల్, ఫిబ్రవరి13 : ఫోర్జరీ కేసులో మానకొండూర్ మండలం దేవంపల్లికి చెందిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. దేవంపల్లికి చెందిన బోయిని శంకరయ్య తన ఇంటి నంబర్‌తో కరీంనగర్ రూరల్ (తిమ్మాపూర్) సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గతేడాది నవంబర్ 8న దాదాపు 10 గుంటల పైబడి రిజిస్ట్రేషన్‌ను తన కుటుంబ సభ్యుల పేరు మీద చేశాడు. ఈ సమయంలో పొందుపర్చాల్సిన పత్రాల్లో ఫోర్జరీ చేసినట్లు గ్రామానికి చెందిన పంచాయతీ సెక్రెటరీ సోమ శాశ్వత మానకొండూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో 10 గుంటల ప్రభుత్వ భూమితోపాటు ఫోర్జరీ చేసినట్లు, శంకరయ్యకు గ్రామానికి చెందిన గుండా అంజనేయులు సహకరించినట్లు ఒప్పుకున్నారు. నకిలీ పత్రాలు సృష్టించినందుకు, ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చూసిన బోయిని శంకరయ్యతోపాటు గుండా అంజనేయులను పలు సెక్షన్‌ల కింద జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఎక్సైజ్ కోర్టులో హాజరు పరిచారు. ఈ మేరకు మెజిస్ట్రేట్ రిమాండ్ విధించి జైలుకు తరలించారు. నిందితుల నుంచి నకిలీ ధ్రువ పత్రాలు, గ్రామ పంచాయతీ, సెక్రటరీ పేరిట ఉన్న నకిలీ స్టాంపులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.